సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 17 । మే । 2023



వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

మాతృశ్రీ కనక వర్షిణి గంగాలమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 8లో



పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

పర్యావరణ పరిరక్షణ అందరి ధ్యేయం కావాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని అరిక ట్టాలని అటవీ అధికారులు కోరారు 8లో



అభివృద్ధి చెందిన దేశంగా భారత్

అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో భారత్ చేరాలన్న సంకల్పంతో ప్రధాని సంస్కరణలు చేపట్టారని కేంద్ర మంత్రి కరాద్ పేర్కొన్నారు. 8లో

న్యూస్‌రీల్

పర్యాటకుల జోష్



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: పలు ప్రాంతాల నుంచి మంగళ వారం పెద్ద సంఖ్యలో వచ్చిన పర్యాటకులు కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేశారు. కొన్నాళ్లుగా పర్యాటకులు రాకపోవడంతో బోసి పోయిన ఈ ప్రాంతం మంగళవారం సందడిగా మారింది. పాడేరు మోదకొండమ్మ తల్లి జాత రకు వచ్చిన పలువురు కార్లు, జీపులు, ఇతర వాహనాల్లో జలపాతం వద్దకు వచ్చారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అన్ని వయస్సు లవారు నీటి ప్రవాహంలో కేరింతలు కొడుతూ గంటల తరబడి జలకాలాడారు. జలపాతం వ్యూ పాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు. రోజంతా ఉల్లాసంగా..ఉత్సాహం గడిపారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

- జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్



అరకులోయ రూరల్: యువతకు ఉపాధి కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందులోభాగంగా స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 19న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అన్నిరంగాల్లో యువత ముందుండాలన్న దృఢ సంకల్పంతో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జాబ్‌మేళాకు హాజరయ్యేవారు పాస్ ఫొటోలు,ఆధార్ కార్డు, ఇతర ధృవీకరణ పత్రాల జెరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. ఉదయం 10 గంటలకు జాబ్ మేళా ప్రారంభం అవుతుందని చెప్పారు.

80 మంది ఉపాధ్యాయులకు పదోన్నతి

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏలో పరిధిలో పనిచేస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు డీడీ జాన్‌రాజ్ మంగళవారం పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్హత కలిగిన 80 మందికి పదోన్నతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవోలు పాల్గొన్నారు.

పలు రైళ్లు రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ): ఆయా స్టేషన్లకు పలు రైళ్లు ఆలస్యంగా చేరుకుంటున్న నేపథ్యంలో.. పలు స్టేషన్లలో బయలుదేరుతున్న రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఆయా స్టేషన్లలో బయలుదేరిన సమయాన్ని బట్టి ఈ రైళ్లు అంతే ఆలస్యంగా స్టేషన్లకు చేరుకోనున్నాయి.

- ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు–హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 1.15 గంటల ఆలస్యంగా బెంగళూరులో మధ్యాహ్నం 11.50 గంటలకు బయలుదేరింది.
- హౌరా–ఎం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(22887) హంసఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.40 గంటలకు హౌరాలో బయలుదేరింది.
- విశాఖపట్నం–కోర్బా(18518) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 2.25 గంటలు ఆలస్యంగా రాత్రి 11.30 గంటలకు విశాఖపట్నంలో బయలుదేరింది.

20న ఐటీఐలో క్యాంపస్ డ్రైవ్

కంచరపాలెం(విశాఖ): ప్రభుత్వ పాత ఐటీఐలో సెనాజియల్ కాస్టింగ్ లిమిటెడ్ కంపెనీ విశాఖ శాఖలో పనిచేసేందుకు ఐటీఐ, డిప్లమో కోర్స్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఈ నెల 20న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు విశాఖలోని ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, ఎంఎంటీఎం, వెల్డర్, డీజిల్ మెకానిక్, ఎంఎంవీ, డిప్లొమో మెకానికల్, మెటలార్జి కోర్స్‌ల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు వారి ధ్రువ పత్రాలతో 20వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9866088240 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

21 నుంచి ఉచిత యోగా శిక్షణ

ఏయూక్యాంపస్: రుషి గాయత్రి యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 21నుంచి ఉచిత యోగ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు కేంద్రం నిర్వాహకులు తెలిపారు. 12 రోజుల పాటు ఈ ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామని, సాయంత్రం 6 గంటలకు యోగా శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి కలిగినవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పూర్తి వివరాలకు 9440395439, 7780154103 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రమోదం...ప్రభంజనం



హృదయ పీఠమే అమ్మకు సింహాసనమైంది... నామ స్మరణే మంత్రోచ్చరణగా ప్రతిధ్వనించింది.. దివ్య మంగళరూపిణి దర్శనంతో జాలువారిన ఆనందబాష్పాలు పాద్యంగా మారాయి.. ఉచ్ఛ్వాసనిశ్వాసాలే వింజామరలయ్యాయి.. తమ భక్తిప్రపత్తులనే నివేదన చేశారు.. మనసులోనే షోడశోపచారాలు సమర్పించి, ఉత్సవాల వేళ మోదమ్మను దర్శించుకున్న భక్తులు తన్మయంతో అలౌకికానందానికి గురయ్యారు. ప్రభంజనంలా తరలివచ్చిన ప్రజలు తల్లి దివ్యరూపాన్ని చూసి పరవశించిపోయారు. మోదమ్మను తమ గుండెల్లో కొలువుదీర్చుకున్నారు.

- అమ్మ దర్శనం.. భక్తి పరవశం
- ఘనంగా ముగిసిన మోదకొండమ్మ జాతర
- మోదమ్మ నామ స్మరణతో హోరెత్తిన పాడేరు

సాక్షి,పాడేరు : జిల్లా కేంద్రం పాడేరులో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన ఉత్తరాంధ్రతో పాటు గిరిజన ప్రాంత ప్రజల ఆరాధ్య దైవం మోదకొండ ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాలకు ప్రభుత్వం తరఫున సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.కోటి మంజూరు చేశారు. ఈనెల 14వతేదీ ఆదివారం ఉత్సవాలు ప్రారంభమై మంగళవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు రోజు పాడేరుకు భక్తులు పోటెత్తారు.తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున మోదమ్మకు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి పట్టువస్త్రాలను పంపారు. వీటిని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర,ఆమె భర్త మూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, డాక్టర్ నరసింగరావు దంపతులు అమ్మవారికి సమర్పించారు. అంతకుముందు ఎమ్మెల్యే దంపతులు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర,ముత్యాలమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు,రమాదేవి దంపతులు మోదకొండమ్మతల్లికి కుంకుమార్చన చేశారు. పలు ప్రాంతాల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు



ఘటాల ఊరేగింపులో భారీగా పాల్గొన్న భక్తులు

తీర్చుకున్నారు. ఘటాలను శిరసున పెట్టుకుని భక్తిశ్రద్ధలతో ఆలయం వరకు మోసి మోదమ్మకు సమర్పించుకున్నారు. మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద కొలువుదీరిన మోదమ్మ ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇత్తడి ఘటాలను దర్శించుకుని పూజలు చేశారు.

అంబరాన్ని తాకిన ఉత్సవం

మోదకొండమ్మతల్లి జాతర ముగింపు ఉత్సవాన్ని మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు,ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర.పాడేరు సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణిలు సతకంపట్టులో కొలువుదీర్చిన మోదమ్మ పాదాలు,ఉత్సవ విగ్రహం,ఇతర ఘటాలకు పూజలు చేసిన అనంతరం శిరసున పెట్టుకుని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు నుంచి సుంద్రుపుట్టు,పాతబస్టాండు మీదుగా అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఎస్పీ తుహిన్ సిన్హా నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించడంతో భక్తులందరికీ అమ్మవారి ఉత్సవ విగ్రహం,పాదాలను మోసే భాగ్యం కలిగింది. ఎక్కడ తొక్కిసలాటలు లేకుండా పోలీసులు రోప్‌ను ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ముగింపు ఉత్సవంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక,కళాప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. పలు ప్రాంతాలకు చెందిన తీన్‌మార్,కేరళ డప్పు వాయిద్యాలు, శక్తి, నేలవేషాలు, థింసా, గిరిజన నృత్యాలు, కోలాటాలు ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.ఒడిశా నుంచి వచ్చిన గిరిజన కళాకారులు ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కట్టప్ప వేషధారణలో ఉన్న గిరిజన కళాకారుడిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపడంతో పాటు, సెల్ఫీలు తీసుకున్నారు. ఊరేగింపు సంబరాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి భక్తులంతా భారీగా తరలివచ్చారు. కిలోమీటరు పొడవున సాగిన ఊరేగింపు సంబరం అంబరాన్ని తాకింది. జై మోదమ్మ నినాదాలతో పాడేరు పట్టణం హోరెత్తింది. రాత్రి వరకు ఊరేగింపు సంబరం కొనసాగింది.



ఘటాలను మోసుకువెళ్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్,ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నరసింగరావు, వర్తన పిన్నయ్యదొర దంపతులు



టీటీడీ పంపిన పట్టువస్త్రాలను సమర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



వేడుకల్లో పాల్గొన్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ఒడిశా కళాకారుల నృత్యం



సతకంపట్టు వద్ద పూజలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

నాణ్యతా ప్రమాణాలతో నాడు-నేడు పనులు

- నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో రూ.200 కోట్లతో నాడు–నేడు రెండవ దశలో చేపట్టిన 1255 పాఠశాలల అభివృద్ధి పనులు నాణ్యతాప్రమాణాలతో నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన పలుశాఖల అధికారులతో నాడు–నేడు పనులపై సమీక్షించారు. 10 కాంపోనెంట్స్‌తో 895 పాఠశాలలు, 335 పాఠశాలలకు అదనపు భవనాలు, 25పాఠశాలలకు ప్రహరీగోడల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ పనులకు సంబంధించి మెటీరియల్ కొనుగోలు,నిధుల వినియోగం, చేసిన పనులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈవారం రూ.4కోట్లు ఖర్చుచేశారని,వచ్చే వారానికి మరో రూ.5కోట్లు ఖర్చుపెట్టాలన్నారు.నిధుల దుర్వినియోగం జరిగితే ఉపేక్షించేదిలేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల నిర్వహణకు ప్రతి మండలానికీ ఓ ప్రత్యేకాధికారిని నియమించినట్టు తెలిపారు. అన్ని పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. సచివాలయాల పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీవోలు సమావేశాలు నిర్వహించి,బడిబయట ఉన్న పిల్లల వివరాలను నమోదు చేయాలని, పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులను గుర్తించాలన్నారు, జగనన్న విద్యాకానుక కిట్లు సకాలంలో పాఠశాలలకు సరఫరా చేయాలని సూచించారు. జేవీకే కిట్ల పంపిణీ పారదర్శకంగా జరగాలని,అధికారులు సక్రమంగా పనిచేయని పక్షంలో భవిష్యత్తులో పదోన్నతులు ఉండవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు,గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు,డీఆర్‌డీఏ పీడీ మురళీ,ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

జి.మాడుగుల ఎంఈవో సస్పెన్షన్

జి.మాడుగుల: మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో జగన్న కిట్స్, పుస్తకాల స్టాక్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఎంఈవో కె.నాగభూషణం అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవో పనితీరుపై ఆరా తీశారు. విధి నిర్వహణ పట్ల అలసత్వం వహిస్తున్నారని తెలుసుకుని సస్పెండ్ చేశారు. జగన్న కిట్స్ నాణ్యతను పరిశీలించాలని, పుస్తకాలను కమిటీ సభ్యులు పాఠశాలలకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జి.మాడుగుల–2గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌రావును కలెక్టర్ ఆదేశించారు.అనంతరం కొత్తపల్లి జలపాతాన్ని సందర్శించి పర్యాటకులకు సదుపాయలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం సింగర్బ పంచాయతీ కంబాలుబయలు గ్రామం వద్ద నిర్మిస్తున్న కాఫీ పల్పింగ్ యూనిట్ పనులను ఆయన పరిశీలించారు. పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గాంధీనగర్ గ్రామంలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ తనిఖీ చేశారు.



గాంధీనగర్‌లో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

విలవిల

- ఉదయం నుంచే భానుడి భగభగలు
- వడగాడ్పులతో 'ఉక్క'రిబిక్కిరి
- జిల్లాలో పలుచోట్ల 44 డిగ్రీల ఉష్ణోగ్రత
- నేడూ ఇదే పరిస్థితి.. ఆపై కాస్త ఉపశమనం



తలపై చీరకొంగులు, చున్నీలను కప్పుకుని వెళ్తున్న పాదచారులు

ఎటపాక/రాజవొమ్మంగి/సాక్షి, విశాఖపట్నం: చల్లటి వాతావరణానికి నిలయమైన మన్యం నిప్పులగుండగా మారింది. రెండురోజులుగా భానుడు భగభగా మండిపోతున్నాడు. పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. 10 గంటలు దాటితే రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. జిల్లాలో పలుచోట్ల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొండాయగూడెంలో మంగళవారం అత్యధికంగా 44.62 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. తప్పనిసరి పరిస్థితుల్లో పనుల నిమిత్తం బయటికి వచ్చే వారు ఎండల ధాటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులు ఎండ వేడిమికి తాళలేక చెట్లనీడనే ఉంటున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు భానుడి భగభగలు తగ్గడంలేదు. రాజవొమ్మంగి పరిసర ప్రాంతాలు నిప్పుల కొలిమిని తలపించాయి. వీధులు, రహదారు లు నిర్మానుష్యంగా మారాయి. దుకాణాలు మూతపడ్డాయి. గురువారం నుంచి కాస్త తగ్గుముఖం పట్టవచ్చని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు 'సాక్షి'కి చెప్పారు. అదే సమయంలో పగలు ఉష్ణతాపం ఉన్నా మధ్యాహ్నం తర్వాత ఆకస్మికంగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షాలకు ఆస్కారం ఉందని తెలిపారు.

జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా.. (డిగ్రీల్లో)

మండలం	గ్రామం	ఉష్ణోగ్రత
కూనవరం	కొండాయగూడెం	44.62
గంగవరం	నువ్వుమామిడి	44.0
ఎటపాక	బుట్టాయగూడెం	42.92
రాజవొమ్మంగి	రాజవొమ్మంగి	41.42
కొయ్యూరు	కాకరపాడు	41.29



రాజవొమ్మంగిలో నిర్మానుష్యంగా మారిన రహదారి

గుడ్, బ్యాడ్ టచ్‌లపై మరింత విస్తృతంగా అవగాహన

రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళి

రాజవొమ్మంగి: గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై పోలీసులు, గిరిజన సంక్షేమశాఖ అధికారులు విద్యార్థినులకు తరచూ కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలే జడ్డంగి లైంగిక వేధింపుల కేసులో నిందితుల అరెస్టుకు దోహదపడ్డాయని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళి తెలిపారు. ఈ కేసుపై విచారణ జరిపేందుకు మంగళవారం ఆయన జడ్డంగి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడి పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇకపై అన్ని పాఠశాలల్లో విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై మరింత విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. జడ్డంగి ఉన్నత పాఠశాలలో విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఐదుగురు ఉపాధ్యాయులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు చెప్పారు. బాధిత విద్యార్థినులు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వడంతో కేసుకు బలం చేకూరిందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపడతామని చెప్పారు. గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నట్టు తెలిపారు. స్థానిక సీఐ షేక్ బాజీలాల్, ఎస్ఐ షరీఫ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ జగదీష్ అడహళి

నేడు వెంకన్న ఆలయ మహాసంప్రోక్షణకు అంకురార్పణ



ఐ పోలవరం జంక్షన్ సమీపంలో వేంకటేశ్వరస్వామి ఆలయం

రంపచోడవరం: ఐ.పోలవరం జంక్షన్ సమీపంలో టీటీడీ నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠాపన, మహాసంప్రోక్షణ కార్యక్రమాలకు బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరుగనుంది. 22వ తేదీన మహాసంప్రోక్షణ, శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. అంకురార్పణలో భాగంగా ఆచార్యవరణం, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం నిర్వహిస్తారు. 22న ఉదయం 9 గంటల నుంచి 9.30 గంటల వరకు మిథున లగ్నంలో మహా సంప్రోక్షణ నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తారు. సాయంత్రం 5 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

తునికాకుపై పరాకు

- గణనీయంగా తగ్గిన సేకరణ
- చెట్ల తొలగింపే ప్రధాన కారణం
- ఉపాధి అవకాశాల మెరుగుతో దూరంగా ఉంటున్న యువత



తునికాకు చెట్లను తొలగిస్తున్న గిరిజనులు

చింతూరు: లాభాల్లో ఉన్న తునికాకు వ్యాపారం క్రమంగా నష్టాల వైపు పయనిస్తోంది. క్రమేపీ మొత్తం వ్యాపారమే మూతపడే ప్రమాదం ఏర్పడుతోంది. ప్రస్తుతం విలీన మండలాల్లో తునికాకు(బీడీ ఆకు) సేకరణలో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సేకరణపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏటా రాష్ట్రంలోని చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో తునికాకు సేకరణ జరుగుతుంది. ప్రతి ఏడాది ఏప్రిల్, మే నెలల్లో నాలుగు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల గిరిజనులు కుటుంబ సమేతంగా తునికాకు సేకరించి విక్రయిస్తుంటారు. నాణ్యమైన తునికాకు మాత్రం విలీన మండలాల్లోనే లభిస్తోంది. దీంతో కాంట్రాక్టర్లు సైతం ఇక్కడ లభ్యమయ్యే తునికాకు కోసం అధిక టెండర్లు వేస్తారు.



తొలగించిన తునికాకు చెట్ల మోడులు

చింతూరు అటవీ డివిజన్‌లోని ఐదు రేంజ్‌ల పరిధిలో నెల్లిపాక, మాధవరావుపేట, ఏడుగురాళ్లపల్లి, కూనవరం, మురుమూరు, వీఆర్‌పురం, చింతూరు, లక్కవరం, కుందులూరు తునికాకు యూనిట్లు ఉన్నాయి.

క్రమేపీ తగ్గుముఖం

యాభై ఆకులను ఒక కట్టగా, వెయ్యి కట్టలను ఒక స్టాండర్డ్ బ్యాగుగా పరిగణించి ఏటా లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. ఆ లక్ష్యానికి అనుగుణంగా కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొంటారు. చివరిసారిగా 2012లో చింతూరు అటవీ డివిజన్‌లో తునికాకు లక్ష్యం 21,465 స్టాండర్డు బ్యాగులు కాగా, 23,552 స్టాండర్డ్ బ్యాగుల సేకరణ జరిగి లక్ష్యాన్ని అధిగమించింది. 2013 నుంచి తునికాకు సేకరణ తగ్గుతూ వస్తోంది.

ఉపాధి అవకాశాల మెరుగుతో...

యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడడంతో తునికాకు సేకరణపై వారు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గతంలో పిల్లల నుంచి పెద్దల వరకు తునికాకు సేకరణలో నిమగ్నమయ్యేవారు. ప్రధానంగా యువత తునికాకు సేకరణను ఆదాయమార్గంగా ఎంచుకుని ఉత్సాహంగా పాల్గొనేవారు. వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి లభిస్తుండడంతో తునికాకు సేకరణకు దూరంగా ఉంటున్నారు.

చెట్ల తొలగింపు

తునికాకు చెట్లు ప్రధానంగా గ్రామాల పొలిమేరల్లోని భూముల్లో ఉంటాయి. భూములను అభివృద్ధి పరచడంలో భాగంగా అడ్డుగా ఉన్న ఆ చెట్లను తొలగిస్తున్నారు. చెట్లు అంతరించి పోతుండడంతో తునికాకు సేకరణ గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో మాత్రమే తునికాకు చెట్లు ఉన్నాయి. తునికాకు లభ్యంతగ్గిపోతుండడంతో భవిష్యత్తులో తునికాకు సేకరణ పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని దీనిపై ఆధారపడే గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.

తునికాకు సేకరణ తగ్గుదల ఇలా

సంవత్సరం	లక్ష్యం	సేకరించినది (స్టాండర్డు బ్యాగుల్లో)
2017	29,065	12,952
2018	22,600	12,240
2019	16,400	12,170
2020	17,300	10,020
2021	15,000	5,197
2022	15,000	1,706

చెట్లు తగ్గడంతో లక్ష్యంపై ప్రభావం

ఉపాధి అవకాశాలు మెరుగు పడడంతో సీజన్‌లో జరిగే తునికాకు సేకరణపై గిరిజనులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో క్రమేపీ తునికాకు సేకరణ తగ్గుతూ వస్తోంది. మరోవైపు భూముల అభివృద్ధిలో భాగంగా తునికాకు చెట్లను సమూలంగా తొలగిస్తుండడంతో చెట్లు కనుమరుగై లక్ష్యంపై ప్రభావం చూపుతోంది.

– వి.సాయిబాబా, డీఎఫ్‌వో, చింతూరు

మోదమ్మ జాతర దృశ్యమాలిక


కుంకుమార్చన చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, నరసింగరావు దంపతులు


కేరళ దప్పు వాయిద్యం


దప్పు వాయిద్యం


డ్రమ్స్ వాయిస్తున్న మహిళా కళాకారులు


కొమ్ము నృత్యం


గరగ నృత్యం


ఉత్సవ విగ్రహాన్ని భక్తులకు అందిస్తున్న పోలీసులు


మోదమ్మకు సమర్పించేందుకు ఘటాలను మోసుకెళ్తున్న భక్తులు


మోదకొండమ్మతల్లి పాదాలను మోస్తున్న ఓ భక్తురాలు

17 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

ఎస్.రాయవరం : నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు మంగళవారం తెలిపారు. రోలుగుంట మండలం బెన్నభూపాలపట్నం గ్రామానికి చెందిన పాకల పరశురామ్ , మట్టిపాటి గణేష్ స్కూటీపై 17 కేజీల గంజాయి తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి గంజాయి, స్కూటీ, రూ 21,500, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పట్టుబడ్డ వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


మహేష్ (ఫైల్)

మునగపాక : మండలంలోని మెలిపాకకు చెందిన యువకుడు మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మెలిపాకకు చెందిన ప్రగడ రమణ వ్యవసాయం సాగు చేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నారు. ఆయనకు ఒక్కగానొక్క కుమారుడు మహేష్ (27)తండ్రికి వ్యవసాయంలో సాయం అందిస్తూ ట్రాక్టర్ నడుపుతూ కుటుంబానికి చేయూతగా నిలుస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటిలో నిద్రించే క్రమంలో ఫ్యాన్ వేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో మహేష్ కుటుంబం తీరని షాక్‌కు గురైంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలుస్తాడని ఆశిస్తున్న తరుణంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. తమకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. అందరితో మంచిగా మెలిగే మహేష్ మృతితో మెలిపాకలో విషాదం అలముకుంది. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

విద్యుత్‌షాక్‌కు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి


కరెంట్ షాక్ గురైన శ్రీను జడ్డంగి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న దృశ్యం (ఫైల్)

రాజవొమ్మంగి : మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామంలో శ్రీను (30) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురి కాగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. జడ్డంగి ఎస్ఐ షరీఫ్ కథనం మేరకు చింతపల్లి మండలం తోటరాజబంధ గ్రామానికి చెందిన శ్రీను ఇటీవలే చిన్నయ్యపాలెంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శ్రీనుకు కరెంటు పనులపై కాస్త అవగాహన వుండడంతో ఆ ఇంటికి సరఫరా లేదని తెలిసి సోమవారం ఎదురుగా వున్న కరెంట్ స్తంభం ఎక్కాడు. స్తంభానికి వున్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు సరిచేస్తుండగా షాక్‌కు గురై కింద పడిపోయాడు. తలకు బలమైన గాయమైన అతనిని కుటుంబీకులు వెంటనే జడ్డంగి పీహెచ్‌సీకు తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి అనంతరం కాకినాడ రిఫర్ చేశారు. అతను అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ మృతి

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ నక్కా పూసిబాబు(47) చికిత్స పొందుతూ మృతి చెందారు. ట్రాఫిక్ సీఐ టి.శ్రీను అందించిన వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కొవ్వూరు నుంచి ఇచ్ఛాపురం వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున స్థానిక జాతీయ రహదారి శారదానది బ్రిడ్జిపై ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. అతనిని హుటా హుటిన పట్టణ ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి చెందారు. ఈ మేరకు మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

24 గంటల్లో కొత్త కనెక్షన్

- జగనన్న కాలనీల్లో సకాలంలో విద్యుత్ సరఫరాకు చర్యలు
- విద్యుత్‌శాఖ ఈఈ సురేష్‌బాబు



బుచ్చెయ్యపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీల్లో విద్యుత్ సమస్యలు లేకుండా సకాలంలో పరిష్కరిస్తున్నామని నర్సీపట్నం విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) ఎన్.సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం బుచ్చెయ్యపేట విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న నర్సీపట్నం, చోడవరం, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, కోటపాడు, దేవరాపల్లి, నర్సీపట్నం, మాకవరపాలెం తదితర 14 మండలాల్లో 450 జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇంటి నిర్మాణదారులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరాకు తగిన చర్యలు తీసికున్నామన్నారు. ఇప్పటికే 247 జగనన్న లే అవుట్లలో విద్యుత్ సరఫరా చేయగా 75 లే అవుట్లలో పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. విద్యుత్ మీటరు కోసం దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే విద్యుత్ కనెక్షన్ అందిస్తున్నామన్నారు. వేసవి కాలంలో కూడా విద్యుత్ కోతలు లేకుండా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ను సకాలంలో అందించడమే కాక పగటిపూట 9 గంటలు నిరంతర విద్యుత్ అందిస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులకు వినియోగదారులు డిజిటల్ చెల్లింపులు అలవాటు చేసుకోవాలన్నారు. ఈస్టర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ యాప్‌ను ఓపెన్ చేసుకుంటే ప్రతి నెలా ఎంత బిల్లు చెల్లిస్తున్నదీ తెలియడమే కాక సకాలంలో విద్యుత్ బిల్లు చెల్లించడం వల్ల అపరాధ రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేసి పరిష్కారం పొందాలన్నారు.

ఐఐటీ/నీట్ మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి 21న పరీక్ష

కంచరపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఐఐటీ/నీట్ మెడికల్ అకాడమీల్లో ప్రవేశాల నిమిత్తం ఈ నెల 21న నిర్వహించే రెండో దశ పరీక్షకు ఎంపికైన జాబితా http://apgpcet. apcfss.inలో అందుబాటులో ఉంది. ఈ మేరకు రాష్ట్ర సంక్షేమ గురుకుల కళాశాలల విశాఖ జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపవతి ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో పేర్లు ఉన్న అభ్యర్థులు రూ.100తో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 21న జరిగే ప్రవేశ పరీక్షకు విశాఖ-అనకాపల్లి జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థులు మాత్రమే డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకులం, శ్రీకృష్ణాపురం కేంద్రానికి హాజరుకావాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 0891-2799641కు సంప్రదించవచ్చు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

వైభవంగా గంగాలమ్మ తల్లి జాతర


బోనాల ఊరేగింపులో భక్తులు

మారేడుమిల్లి : మారేడుమిల్లి గ్రామ దేవత మాతృశ్రీ కనక వర్షిణి గంగాలమ్మ తల్లి జాతర ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం వరకు ఐదు రోజులు జరిగే ఈ ఉత్సవాలకు కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రధాన ముఖద్వారం వద్ద విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. మారేడుమిల్లితో పాటు పరిసర గ్రామాల నుంచి వేలాదిగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. అమ్మవారికి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది. తొలి రోజు మంగళవారం ఉదయం 5.30 నిమిషాలకు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రీ లక్ష్మి శ్రీనివాసురెడ్డి, శ్రీమతి సింధు, వైస్ సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, శ్రీమతి లక్ష్మి దంపతులతో పూజ కార్యక్రమం నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి గ్రామ ప్రధాన వీధుల్లో మహిళలు బోనాలు తలపై పెట్టి ఊరేగించారు. ఆనవాయితీ ప్రకారం గిరిజన పూజారులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గరగరాలాట, కోలాటం, తిన్మార్ డాన్సులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న కాంతారా నృత్యాలు

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన గంగాలమ్మ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. అమ్మవారి గరగను డప్పువాయిద్యాలు, బాణాసంచా వెలుగుల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. దీప దూపాలతో గంగాలమ్మకు భక్తులు మొక్కులు చెల్లించుకొన్నారు. దీంతో దూసరపాములో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారి సంబరాల్లో కాంతారా నృత్యాలు ఆకట్టుకొన్నాయి. తాడేపల్లి గ్రామానికి చెందిన 18 మంది కళాకారులు కాంతారా దేవతతో పాటు, ప్రథమగణాలు, దశావతారాలు, శక్తి, రావణాసురుడు తదితర వేషధారణతో నృత్యాలు చేశారు. ఆయా కళాకారులకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ చీడి శివ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రముఖులు, నాయకులు, యువత ఏర్పాట్లను పర్యవేక్షించారు.


విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి ముఖద్వార ప్రాంగణం


దూసరపాము గ్రామంలోని గంగాలమ్మ సంబరాల్లో శక్తివేషధారణ

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం


ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

చింతపల్లిరూరల్: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలని డీఎఫ్ఓ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద మిషన్ లైఫ్(పర్యావరణహిత)కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవ జాతులు కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కాలుష్యం జరుగుతుందని దాన్ని నిర్మూలించాలన్నారు. ప్రతి ఒక్కరు పర్యావరణహితంగా జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. అనంతరం అటవీశాఖ సిబ్బందితో జీవరాశులను కాపాడుకుంటామంటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి ఎల్‌బీకే పాత్రుడు, డీఆర్‌వో వెంకటరాజు, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: అడవిని కాపాడి మొక్కలు పెంచితే రానున్న తరాలు సుఖంగా ఉంటాయని పెదవలస రేంజర్ కె.జగదీష్ సూచించారు. పర్యావరణానికి అనకూలంగా జీవనం (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) కార్యక్రమాన్ని మంగళవారం మంప, రేవళ్లలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రేంజర్ జగదీష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. పాలిథిన్ కవర్లు వర్షపు నీటిని భూమిలోకి ఇంకనివ్వకుండా అడ్డుకుంటాయన్నారు. దీని మూలంగా వర్షాలు కురిసినా నీరు భూమిలోకి వెళ్లదన్నారు. అదే విధంగా వాడిన కవర్లను మురికికాలువల్లో వేయడంతో అక్కడ నీరు కూడా ముందుకు కదలదన్నారు. ప్రకృతి సమతుల్యతలో అడవులు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. పోడు పేరిట అడవులను నరకడంతో పర్యావరణం పాడవుతుందన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. కొయ్యూరు సెక్షన్ అధికారి కె.సింహాద్రి, సిబ్బంది సూకరాజు, ఎం.నాగేశ్వరరావు, ఆర్.రాకేష్ కుమార్, కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.


ఎటపాకలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ

ఎటపాక: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని నెల్లిపాక రేంజ్ అధికారి మూర్తి అన్నారు. పర్యావరణ హిత జీవనశైలి రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా మంగళవారం నెల్లిపాక రేంజ్ పరిధిలో రాయనపేట పంచాయతీలో పర్యావరణహిత జీవనశైలి అలవర్చుకోవాలని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే మానవాళికి పెనుముప్పు సంభవిస్తుందని చెప్పారు.ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని రక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో కవిరాజు, ఎఫ్‌బీవోలు మూర్తి, వెంకటలక్ష్మి తదితరులున్నారు.

2047కు అభివృద్ధి చెందిన దేశంగా భారత్

- ఆ దిశగా ప్రధాని మోదీ ప్రణాళికలు
- అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ప్రయాణం
- రోజ్‌గార్ మేళాలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగ్‌వత్ కరాడ్

దొండపర్తి (విశాఖ దక్షిణ): అత్యధిక యువశక్తి కలిగిన భారత్.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరాలన్న సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగ్‌వత్ కిషన్‌రావ్ కరాడ్ పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు సాధించిన 388 మంది అభ్యర్థులకు మంగళవారం పోర్టు కళావాణి ఆడిటోరియంలో జరిగిన రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2047కు దేశానికి స్వతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తవుతుందని, అప్పటికి భారత్ ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్రం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. ఒకవైపు మాంద్యం కారణంగా అగ్రదేశాలు ప్రధానంగా అమెరికా, చైనాలు సతమతమవుతుంటే.. భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టంగానే ఉందని స్పష్టం చేశారు. ప్రధానంగా ద్రవ్యోల్బణం రేటు తక్కువగానే ఉండడం శుభపరిణామమన్నారు. పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలో ద్రవ్యోల్బణం విపరీతంగా పెరిగిన కారణంగా అక్కడ నిత్యావసర ధరలు మండిపోతున్నాయని గుర్తు చేశారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా..

ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థల్లోనే కాకుండా దేశంలో కల్పిస్తున్న మౌలిక వసతులతో ఎంఎస్ఎంఈ, ఇన్‌ఫ్రా రంగాలు గణనీయంగా పుంజుకొని విస్తృత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని భగ్‌వత్ కిషన్‌రావ్ కరాడ్ తెలిపారు. ప్రధానంగా మేకిన్ ఇండియా ద్వారా వైద్య, రక్షణతో పాటు అనేక రంగాల్లో దేశీయ పరిజ్ఞానంతో ఉత్పత్తులను తయారు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో అవలంబిస్తున్న నూతన విధానాలతో గత ఆర్థిక సంవత్సరంలో 84.84 బిలియన్ డాలర్లు పెట్టుబడులు వచ్చినట్లు వెల్లడించారు. దీంతో ఆర్థికంగా మరింత బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో ప్రగతి దిశగా పయనిస్తున్న దేశంలో యువతకు 10 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో రోజ్‌గార్ యోజన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా విశాఖలో 388 మందికి పోస్టల్, రైల్వే, ఎయిమ్స్, ఐఐఎం జీఎస్ఐ వంటి కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థల్లో ఉద్యోగాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వి.రాములు, కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్, డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ గుప్తా, రైల్వే పోర్టు బీఎస్ఎన్ఎల్, ఐఐఎం అధికారులు పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి టౌన్: జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హులైన విద్యార్థుల నుంచి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓబీసీ, కాపు విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలి. వీరికి పీజీ, పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ చదివేందుకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. అంతర్జాతీయంగా టాప్ 50 విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే వెసులుబాటు ఉంది. క్వాలిఫైయింగ్ కోర్సులో 60 శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్ ఉన్న విద్యార్థులు ఈ పథకానికి అర్హులు. ఎంబీబీఎస్ కోర్సులో చేరాలనుకొనే ఇంటర్మీడియేట్ విద్యార్థులు నీట్ పరీక్షలో అర్హత సాధించాల్సి వుంటుంది. అర్హులైన విద్యార్థులు https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సివుంటుంది.